ఈనాడు
పార్వతీపురం మన్యం

మంగళవారం అక్టోబరు 1, 2024



వినతులు స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి, పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్

అన్ని మండలాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మక్కువ, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన పాలన అందించేలా, గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేలా త్వరలో అన్ని మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం సాలూరులో జిల్లా పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ్‌తో కలిసి 238 మంది నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, డీఎంహెచ్‌వో విజయపార్వతి, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డీఆర్‌డీఏ పీఈ వై.సత్యంనాయుడు పాల్గొన్నారు.

మక్కువ మండలం దుగ్గేరు నుంచి సాలూరు మండలం కొండశిఖర గ్రామం చినమేడంగికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు వినతిపత్రం అందించారు. రెండు గ్రామాల మధ్య సుమారు 9 కిలోమీటర్ల దూరం ఉంటుందని, మట్టి, రాళ్లు తేలి ఉండటంతో రేషన్‌కు, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సుమారు 50 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి విన్నవించారు.



మరికొన్ని ఫిర్యాదులు..

అధికారులు, తెదేపా నాయకులు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తమకు తెలియజేయడం లేదని మక్కువ మండలానికి చెందిన పలువురు సర్పంచులు ఫిర్యాదు చేశారు. ★ అంధత్వంతో బాధపడుతున్నానని, పింఛను మంజూరు చేయాలని సాలూరు పట్టణానికి చెందిన కె.వరలక్ష్మి కోరారు. ★ తనకు భూమిపై ఉన్న హక్కులను జగనన్న రీసర్వే ద్వారా తొలగించారని, న్యాయం చేయాలని మక్కువ మండలం మార్కొండపుట్టికి చెందిన సీహెచ్.గౌరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

1.42 లక్షల మందికి.. రూ.59.37 కోట్లు



పార్వతీపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం పంపిణీ చేస్తామని జిల్లా పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల స్థాయి అధికారులతో దూర దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. ఒక్క రోజులోనే 100 శాతం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని 15 మండలాలు, మూడు పట్టణాల్లో 1.42 లక్షల మందికి రూ.59.37 కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

దరఖాస్తు చేసుకుంటే..

పింఛను పొందుతున్న దివ్యాంగ విద్యార్థులు ఇతర జిల్లాల్లో చదువుతుంటే ప్రతి నెలా బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసే అవకాశం ఉందని డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీ సత్యంనాయుడు తెలిపారు. అర్హులు డీఆర్డీఏకు దరఖాస్తు చేస్తే సెర్ప్ నుంచి అనుమతి తీసుకొని వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు.

జే బ్రాండ్‌కు స్వస్తి

ఇక ప్రైవేటు మద్యం అమ్మకాలు

నేటి నుంచి నూతన విధానం అమలు

ఈనాడు–పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే–రాజాం

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని మంగళవారం నుంచి అమలు చేయనుంది. సర్కారీ వారి మందు దుకాణాల్లో అమ్మకాలకు సోమవారంతో తెరపడింది. వైకాపా పాలనలో నూతన విధానం తీసుకొచ్చి ప్రభుత్వ దుకాణాలు తెరిచింది. జె-బ్రాండ్ల పేరుతో నాసిరకం అమ్మకాలు చేపట్టింది. ప్రతిపక్షాలు, మందుబాబులు గగ్గోలు పెట్టినా వెనక్కి తగ్గలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, మద్యం ధరలు, నాణ్యతపై అధ్యయనం చేసి నూతన విధానానికి శ్రీకారం చుట్టింది.

అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దాన్ని ఇప్పుడు అమలు చేయనున్నారు. ఇకపై మందుబాబులు కోరుకునే అన్ని బ్రాండ్లకు అనుమతివ్వనుంది. తక్కువ ధర విభాగంలో క్వార్టర్ బాటిల్ మద్యాన్ని రూ.100 లోపే అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో క్వార్టర్ బాటిల్ మద్యం సుమారు రూ.200 వరకు ఉండేది. దీంతో యువత గంజాయి, మత్తు పదార్థాల వైపు మొగ్గుచూపారనే ఆరోపణలు వినిపించాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని రూ.99 లోపే ధర ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దోపిడీకి తెర

వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో మద్యం పేరుతో తెరతీసిన దోపిడీకి అక్టోబరు ఒకటితో తెరపడనుంది. నాసిరకం మద్యంతో మందుబాబుల జేబులు, ఆరోగ్యం గుల్లచేసింది. అయిదేళ్లలో రూ.6,876 కోట్ల విలువైన నాసిరకం మద్యం తాగించింది. ప్రస్తుతం రెండు జిల్లాల్లో 202 దుకాణాల్లో రోజుకు సగటున రూ.4 కోట్లకు పైగా విక్రయిస్తున్నారు. కొత్త దుకాణాల లైసెన్సులు దక్కించుకునేందుకు ప్రైవేటు వ్యాపారులు ఆరాటపడుతున్నారు.



కూడికలు, తీసివేతల్లో తలమునకలై ఉన్నారు. గతంలో ఈ వ్యాపారంలో అనుభవం ఉన్న వారు తమ అనుచరులతో దరఖాస్తు చేయించాలని నిర్ణయించారు. తక్కువ జనాభా, ఎక్కువ వ్యాపారం జరిగే గ్రామీణ ప్రాంత దుకాణాలపై ఎక్కువ మంది కన్నేశారు. నూతన విధానం అమలు విషయమై విజయనగరం ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ బాబ్జీరావు వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. నోటిఫికేషన్‌కు అనుగుణంగా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

స్వల్పంగా పెరిగే అవకాశం

నూతన మద్యం విధానంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల కన్నా స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. గీత కార్మికులకు (గౌడ, ఈడిగ) రిజర్వ్ చేసిన దుకాణాలకు రెండురోజుల్లో పాలసీ రానుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం... విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 202 దుకాణాలు ఉండగా ప్రస్తుతం 223 మద్యం దుకాణాలకు అనుమతివ్వనున్నట్లు సమాచారం.

ఉభయ జిల్లాలో ఇలా..

జిల్లా	సాధారణ దుకాణాలు	గీతకార్మికులకు కేటాయించినవి	మొత్తం
విజయనగరం	149	16	165
మన్యం	53	05	58

రెండు జిల్లాల్లో 223 దుకాణాలు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 223 ప్రైవేటు మద్యం దుకాణాలు తెరవనున్నట్లు సమాచారం. అక్టోబరు ఒకటి నుంచి తొమ్మిది వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తారు. అందిన దరఖాస్తుల్లో ఒక్కో దుకాణాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. దీనికి సంబంధించి సోమవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, దాని కోసం ఎదురుచూస్తున్నట్లు ఎక్సైజ్ యంత్రాంగం చెప్పింది.

నాలుగు శ్లాబుల్లో లైసెన్సులు

నూతన మద్యం విధానం ద్వారా అమ్మకాలకు ఎక్సైజ్ అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. జనాభా ప్రాతిపదికన నాలుగు స్లాబుల్లో లైసెన్స్‌దారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయనుంది. 10 వేల జనాభాలోపు రూ.5 లక్షలు.. 50 వేల లోపు రూ.50 లక్షలు.. 50 వేలు దాటి లక్ష జనాభా లోపు రూ.65 లక్షలు.. లక్ష జనాభా దాటిన తర్వాత రూ.85 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏ ప్రాంత, ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినా మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చు.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

స్వర్ణమయం.. కోటదుర్గమ్మ

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సుమారు రూ.24.19 లక్షలతో 108 మంది భక్తులు సమకూర్చిన 108 బంగారు పుష్పాలతో పూజలు చేయనున్నారు. ఇప్పటికే భక్తులు సమర్పించిన రూ.45 లక్షల విలువైన బంగారు కిరీటం, రూ.11 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయి. వీటిని ఉత్సవాల నేపథ్యంలో పది రోజుల పాటు అమ్మవారికి అలంకరించనున్నారు. వీటితో పాటు స్వర్ణ పుష్పార్చన జరగనుంది. ఇందుకు దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు పొందినట్లు ఈవో వి.వి.సూర్యనారాయణ తెలిపారు. అమ్మవారి దర్శనం ఉచితంగానే ఉంటుందని, శీఘ్రదర్శనానికి రూ.30, ప్రత్యేక దర్శనానికి రూ.100, సంబర ఘటాలకు రూ.200, స్వర్ణ పుష్పార్చనకు రూ.300, పెద్దవాహనాల పూజకు రూ.వంద, ద్విచక్ర వాహన పూజకు రూ.50, కుంకుమపూజకు రూ.50, పది రోజులు కుంకుమ పూజకు రూ.500, చిన్నతీర్థం రూ.25, పెద్ద తీర్థం రూ.వంద చొప్పున టికెట్ ఖరారు చేసినట్లు చెప్పారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షకుడు పి.కొండలరావు ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. వాటి పర్యవేక్షణ బాధ్యత తెదేపా పట్టణాధ్యక్షుడు జి.సంతోష్‌కు అప్పగించారు.



ఓపీ విభాగం వద్ద రద్దీ

ఎటు చూసినా కిటకిట

వర్షం పడటమే ఆలస్యం.. మన్యంలోని మారుమూల గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామీణ ప్రజలు రుగ్మతల బారిన పడి ఆసుపత్రులకు తరలివస్తున్నారు. సోమవారం పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిలో అన్ని విభాగాలు కిటకిటలాడాయి. ఏకంగా 550 మంది ఓపీకి వచ్చి చీటీలు రాయించుకున్నారు. ప్రధానంగా చిన్న పిల్లల విభాగంలో దగ్గు, జ్వరం, జలుబు, చర్మ సంబంధిత వ్యాధులతో 70 మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వాతావరణంలో మార్పులతో పిల్లల శరీరంపై దద్దుర్లు కనిపిస్తున్నాయని చిన్న పిల్లల వైద్యుడు వెంకటరావు తెలిపారు. వర్షాలతో పాటు ఎండ తీవ్రత, ఉక్కబోత ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయని, అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలని ఆసుపత్రి పర్యవేక్షకురాలు వాగ్దేవి సూచించారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం



పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు



ఉందా.. జాతీయ భాగ్యం

విజయనగరం - పాలకొండ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదన

గత పాలకులు రహదారుల విస్తరణను పూర్తిగా విస్మరించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఒడిశాకు రాకపోకలు సాగించడానికి కీలకమైన విజయనగరం - పాలకొండ మార్గాన్ని అయిదేళ్లూ నిర్లక్ష్యం చేశారు. దీనిని ఒడిశా రాష్ట్రం హద్దుబంగి వరకు జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలని గత 25 ఏళ్లుగా ప్రతిపాదన ఉంది. – న్యూస్‌టుడే, గరివిడి, చీపురుపల్లి



ఉన్నతీకరించాల్సిన ప్రధాన రహదారి

రాష్ట్రంలో అత్యధిక ట్రాఫిక్ ఉన్న 3,059 కిలోమీటర్ల పొడవున ఉన్న 31 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని రాష్ట్ర రహదారుల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఇటీవల కోరారు. అందులో 70.31 కి.మీ ఉన్న విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారి ఒకటి. దీనిని విస్తరిస్తే రవాణా సదుపాయం మెరుగుపడి నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, పాలకొండ నియోజకవర్గాలు పారిశ్రామికంగా, విద్య, వైద్యపరంగా అభివృద్ధి చెందుతాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి.. వలసలు తగ్గుముఖం పట్టే అవకాశముంది.

గతంలో రూ.613 కోట్లతో..

తెదేపా ప్రభుత్వ హయాంలో 2016 డిసెంబరు 8న పీపీపీ విధానంలో ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.613.91 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులిచ్చారు. ఒక కి.మీ రహదారి నిర్మాణానికి రూ.5.42 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు సిద్ధం చేశారు. చీపురుపల్లి, గరివిడి, నెల్లిమర్ల, రాజాం పట్టణాల వద్ద బైపాస్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ మేరకు హద్దుబంగి వరకు జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలంటూ నాటి కేంద్రమంత్రి పి.అశోక్‌గజపతిరాజు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. తాజాగా కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. మరోవైపు కేంద్రమంత్రి కె.రామ్మోహనాయుడు, రాష్ట్ర ర.భ.శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి దిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి అభివృద్ధి చేయాలంటూ కోరారు.

మన్యం లోగిళ్లు.. ప్రగతి దివ్వెలు

● పీవీటీజీ గ్రామాల్లో అభివృద్ధి



ఓ గ్రామంలో చెలమ వద్ద నీరు తోడుకుంటున్న మహిళలు. ఇకపై ఇలాంటి సమస్యలుండవు.

న్యూస్‌టుడే, పార్వతీపురం

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వెనుకబాటుకు గురైన తెగల అభ్యున్నతికి జన్‌మన్ యోజన పథకంలో తొమ్మిది రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు అమలు చేస్తోంది. సంబంధిత పథకాల తీరుతెన్నులు, గిరిజనుల స్పందన తెలుసుకునేందుకు ప్రధాని మోదీ గాంధీ జయంతి సందర్భంగా ముచ్చటించనున్నారు. పార్వతీపురంలో రాష్ట్ర కార్యక్రమం నిర్వహించనున్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి, విద్యుత్తు

ప్రతి కుటుంబానికి తాగునీటి కుళాయి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు 63 గ్రామాల్లో 11 వేల కుటుంబాలకు అందించనున్నారు. వంద శాతం గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించారు. 83 చరవాణి టవర్లు ఏర్పాటు చేశారు. మరో 25 నిర్మించాల్సి ఉంది. 813 గ్రామాల్లో 215 నివాసాలకు రహదారుల అవసరం ఉంది. ఇక్కడ పనులు చేసే బాధ్యతను ఇంజినీరింగ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగాలకు అప్పగించారు.

జిల్లాలో పీవీటీజీల వివరాలు..

మండలాలు:	15
గ్రామాలు:	813
గృహాలు, కుటుంబాలు:	24,389
జనాభా:	1,00,297
తెగలు:	సవర, గదబ

విద్య, ఉపాధి..

ప్రతి పీవీటీజీ గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల లోపు పాఠశాల ఉండాలి. దూరంగా ఉన్న వాటిని చేరువ చేసేందుకు జిల్లాకు నాలుగు వసతి గృహాలు మంజూరు చేశారు. సీతంపేట మండలంలో 3, భామినిలో ఒకటి ఏర్పాటు చేస్తారు. జిల్లాలో నాలుగు ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. వీటి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. 29 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ★ సవర, గదబ తెగలకు చెందిన గిరిజనులకు వన్‌దన్ వికాస కేంద్రాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి ఉపాధి కల్పించనున్నారు. ప్రస్తుతం 37 వీడీవీకేలు ఉండగా మరో 17 మంజూరు చేశారు.

అందరికీ ఇళ్లు, వైద్యం

★ ఉమ్మడి జిల్లాలోని 15 మండలాల్లో పీఎం జన్‌మన్ అమలు చేస్తున్నారు. పార్వతీపురం మన్యంలో సీతంపేట మినహా 14 మండలాలు, విజయనగరం జిల్లాలో మెంటాడలో కార్యక్రమం అమలవుతోంది. ★ 16,106 కుటుంబాలకు పక్కా ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. కొత్తగా 4,077 మంజూరు చేశారు. మరో 2,271 అవసరమని తేల్చారు. అక్టోబరు 2న మరికొందరికి ఇవ్వనున్నారు. ★ 52 గ్రామాలకు వైద్య సేవలు అందడం లేదు. అక్కడ పరిస్థితిని పరిశీలించి సమీప పీహెచ్‌సీలు, ఆరోగ్య స్వస్థత కేంద్రాలకు ట్యాగింగ్ చేశారు.

ప్రగతి స్టాళ్లలో చూపించాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పీవీటీజీ గ్రామాల్లో చేపట్టిన ప్రగతిపై అక్టోబరు 2న నిర్వహించే కార్యక్రమంలో స్టాళ్లు ఏర్పాటు చేసి చూపించాలి. గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.– శ్యామ్‌ప్రసాద్, కలెక్టరు

మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ఠ చర్యలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు, అటవీ, అబ్కారీ శాఖలు సమన్వయంతో తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తనిఖీ కేంద్రాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కొందరు సాధారణ ప్రయాణికుల్లా బస్సుల్లో మద్యం తరలిస్తున్నారని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. జిల్లాలో 22 కేసుల్లో 276 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని 44 మందిపై కేసులు నమోదు చేశామని ఏఎస్పీ దిలీప్‌కిరణ్ తెలిపారు. డీఎఫ్‌వో ప్రసూన, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఆరోగ్య శాఖ ప్రతినిధి వినోద్‌కుమార్, బీసీ, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారులు కృష్ణ, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి

కంటి చూపులో మసక

నిలిచిన ఈ-నేత్ర సేవలు

పార్వతీపురం పట్టణం, కురుపాం, న్యూస్‌టుడే: పేదల కంటిచూపునకు భరోసా కలిగించే ముఖ్యమంత్రి ఈ-నేత్ర కేంద్రాలు మూతపడ్డాయి. గతంలో తెదేపా ప్రభుత్వం హయాంలో 2018లో సీహెచ్‌సీల్లో ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వం, అపోలో ఆసుపత్రి మధ్య ఒప్పందం ప్రకారం నడిచాయి. గతంలోనే అపోలోతో ఉన్న గడువు ముగియడంతో ఆరు నెలలు పొడిగించారు. అది కూడా గత నెల 4వ తేదీతో అయిపోవడంతో సేవలు నిలిచిపోయాయి.

జిల్లాలో కురుపాం, సాలూరు సీహెచ్‌సీల్లో ఈ-నేత్ర సేవలు అందుబాటులో ఉండేవి. రోజు 40 నుంచి 60 మంది వరకు చికిత్సలు పొందేవారు. ప్రస్తుతం కేంద్రాలు తెరుచుకోనందున కంటి సంబంధ సమస్యలతో వచ్చిన వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు(పాత చిత్రం)

అత్యాధునిక పరికరాలు

ఈ-ఐ కేంద్రంలో అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు చేసేవారు. నివేదికలు అపోలో ఆసుపత్రి నిపుణులకు వెళ్లేవి. వారి సూచనలు, సలహాలతో వైద్యం అందించేవారు. భవిష్యత్తులో వచ్చే సమస్యలను కూడా ముందుగానే గుర్తించడంతో పాటు నివారణ చర్యలను వైద్య నిపుణులు సూచించేవారు. అవసరమైన వారికి వారం రోజుల్లో కళ్లద్దాలు అందించేవారు. శస్త్రచికిత్సలు కూడా చేసేవారు. ఖరీదైన నేత్ర వైద్యం ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకోలేని వారంతా ఇక్కడికే వచ్చేవారు. జిల్లాలో ఉన్న జనాభాలో మూడొంతులు పేదలే. వీరికి ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయుక్తంగా ఉండేవి. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నామని, ఈ-ఐ కేంద్రాలపై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జి.నగేష్‌రెడ్డి తెలిపారు.

38,655 మందికి పరీక్షలు

కురుపాం, సాలూరు సీహెచ్‌సీల్లో 2018, ఫిబ్రవరి 1న కేంద్రాలు ప్రారంభించారు. గత ఆరేళ్లలో రెండు కేంద్రాల్లో 38,655 మందికి పరీక్షలు చేశారు. కంటి సమస్యలతో వచ్చిన వారిలో 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేశారు. కళ్లద్దాలు మాత్రం చిన్నపిల్లలతో పాటు అవసరమైన 59,752 మందికి అందించారు.

సిటీస్కాన్ సేవల పునరుద్ధరణ



పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిలో సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాంకేతిక లోపంతో యంత్రం ఇటీవల పని చేయలేదు. దీంతో రోగులు స్కానింగ్ కోసం బయటకు వెళ్లి రూ.3 వేల వరకు ఖర్చు చేసేవారు. వారిపై ఆర్థిక భారం పడుతోందని గతనెల 27న 'ఈనాడు'లో 'ఆగాయ్.. సిటీ స్కాన్ సేవలు' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై సూపరింటెండెంట్ వాగ్దేవి, ఆర్ఎంవో శ్యామల, కేంద్రం నిర్వాహకులు స్పందించారు. రూ.31,700తో యంత్రం బాగు చేశారు. దీంతో ఆదివారం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఈనాడు కథనానికి స్పందన

మూడు వాహనాల పట్టివేత

ఈనాడు, విజయనగరం, దత్తిరాజేరు, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న మూడు వ్యాన్‌లను పట్టుకున్నట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. వాహనాల్లో 19 పశువులు ఉన్నాయని, సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి అక్రమంగా పశువుల రవాణాపై సోమవారం ఈనాడులో 'పెదమానాపురం టు కేరళ' శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించారు. సంత యాజమాన్యం బాధ్యతగా ఉండాలని, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ★ పశు అక్రమ రవాణాపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకుడు, జిల్లా కలెక్టర్, ఎస్పీకు లేఖలు రాశారు. ప్రభుత్వ యంత్రాంగానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

తెలంగాణ డీఎస్సీలో మెరిసిన శ్రీరామ్



శ్రీరామ్

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో విజయనగరంలోని భవానీనగర్‌కు చెందిన కె.వి.ఎన్.శ్రీరామ్ గణితం విభాగంలో(స్కూల్ అసిస్టెంట్) మొదటి ర్యాంకు సాధించాడు. 100కు 84.83 మార్కులు లభించాయి. 2022, 2023 తెలంగాణ టెట్‌లో ప్రతిభ కనబర్చాడు. రెండు సార్లు వరుసగా మూడో స్థానంలో నిలిచాడు. 2022 ఏపీ టెట్‌లో 150కి 129 మార్కులు పొందాడు. ప్రస్తుతం ఏపీ డీఎస్సీకి సిద్ధమవుతున్నాడు. బీటెక్ చేసిన ఈ అభ్యర్థి ప్రభుత్వ ఉద్యోగం సాధించే ప్రయత్నంలో ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. తొలుత సచివాలయం సంక్షేమ సహాయకునిగా ఎంపికై, కొన్ని నెలలకే ఉద్యోగం వదులుకుని డీఎస్సీకి సిద్ధమవుతున్నట్లు చెబుతున్నాడు.

బంతిపూలు.. రైతు ఇంట సిరులు



రామభద్రపురంలో పువ్వుల్ని తీస్తున్న మహిళా రైతులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: బంతిపూలు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. గత మూడు నెలలుగా రూ.50 ఉన్న కేజీ ధర ఇప్పుడు రూ.200 పలుకుతోంది. ఈసారి సాగు కూడా బాగుందని, గతంతో పోల్చితే అధిక ఆదాయం అందుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. రామభద్రపురం పంచాయతీలో దాదాపు 350 మంది రైతులు బంతి పూలు సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు 20 సెంట్లు నుంచి 30 సెంట్ల వరకూ మొక్కలు నాటారు. ప్రస్తుతం రామభద్రపురం మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసి బొబ్బిలి, గజపతినగరం, విజయనగరం ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తున్నారు. దసరా, కార్తిక మాసం, స్వాముల పూజలు రాబోతున్న నేపథ్యంలో గిరాకీ పెరుగుతుందని అంటున్నారు.

ఈ ఏడాది కలిసొచ్చింది..



పువ్వుల సాగు కలిసొచ్చింది. నేను 20 సెంట్ల భూమిలో బంతి పూల సాగుకు రూ.10 వేలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటివరకు పలుమార్లు పువ్వులు కోయగా రూ.25 వేలు ఆదాయం వచ్చింది. ఇంకా పంట ఉంది.

- తూముల తిరుపతి, రైతు

ఇబ్బందులు తీరుతున్నాయి..



ప్రతి సంవత్సరం మేము పూలు సాగు చేస్తున్నాం. ఈ ఏడాది 30 సెంట్ల భూమిలో చేపట్టాం. మార్కెట్లో ప్రస్తుతం బుట్ట రూ.200కు కొనుగోలు చేస్తున్నారు. దసరా వస్తే పూల ధర రూ.400 వరకూ పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక కష్టాలు తీరుతున్నాయి.

- కె.రాములు, రైతు

అవగాహన కల్పిస్తాం: బంతి పూల సాగును పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఇందులో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ రాయితీలను రైతులకు అందిస్తాం. ఈ ఏడాది మెరుగైన ఆదాయం వచ్చింది. - మోహన్‌కృష్ణ, ఉద్యాన శాఖ అధికారి, రామభద్రపురం

అప్రమత్తతతో అగ్గితెగులు నివారణ



కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వరి పంటకు సోకే ప్రమాదకర తెగుళ్లలో అగ్గి తెగులు ప్రధానమైంది. ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. తీవ్రత ఎక్కువ అయితే వెన్నులు విరిగి పోతాయి.

ఇలా చేస్తే మేలు.. నాణ్యమైన విత్తనాలు సాగు చేయాలి. ◆ కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. ◆ లీటరు నీటిలో ట్రైసైక్లోజోల్ 75 శాతం 0.6 గ్రాములు లేదా ఎడిఫెన్ఫాన్ ఒక మిల్లీ లీటరు కలిపి పైరుకు పిచికారీ చేయాలి. ◆ అవసరానికి తగినంత యూరియా వేయాలి. ◆ చేనులోని గట్లపై కలుపు తొలగించాలి. ఇలా చేస్తే అగ్గి తెగులు నియంత్రించవచ్చని కురుపాం మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు.

రైతేరాజు

బొప్పాయిలో యాజమాన్య పద్ధతులు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: బొప్పాయి పోషకాల గని. వాతావరణంలో మార్పులతో తెగుళ్లు విజృంభించి పంటను దెబ్బతీస్తున్నాయి. సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి ఫలసాయం పొందొచ్చని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు సూచించారు.



తెగులు సోకిన మొక్క

కాండం కుళ్లు తెగులు: మొక్క వేర్లు, మొదలు కుళ్లిపోతాయి. లీటరు నీటిలో బోర్డో మిశ్రమం 1 శాతం లేదా అలియేట్ 2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో 2-4 సార్లు మొదలును తడపాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువుంటే లీటరు నీటికి 2 గ్రాముల రిడోమిల్ ఎం.జడ్ కలిపి మొదళ్లలో వేయాలి.

బూడిద తెగులు: ఆకులు, కాడలు, కొత్త చిగుళ్లపై తెలుపు రంగు శిలీంద్రం వస్తుంది. నీటిలో కరిగే గంధకం 3 గ్రా.లేదా కెరాథేన్ మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

పక్షి కన్ను: ఆకులు, కాయలపై వలయాకార నీటి మచ్చలు ఏర్పడతాయి. కాయల నాణ్యత, దిగుబడి తగ్గుతుంది. లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ కలిపి కోతకు 30-40 రోజుల ముందు పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. బొప్పాయి నారులో రసం పీల్చే పురుగు చొరబడకుండా నైలాన్ మెష్ నెట్ హౌస్‌లో పెంచాలి. పొలం చుట్టూ రక్షణగా అవిశ, పొడవాటి సజ్జ, జొన్న, మొక్కజొన్న రెండేసి వరుసలగా వేసుకుంటే రసం పీల్చే పురుగును నియంత్రించొచ్చు. ★ జిగురు పూసిన పసుపు రంగు అట్టలను ఎకరాకు 12-15 చొప్పున అమర్చాలి. ★ మొక్క నాటే 3 రోజుల ముందు ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ రసం పీల్చే పురుగు నివారణకు వేపనూనె 2.5 మి.లీ+ఎసిఫేట్ 2.5గ్రా+జిగురు 0.5 మి.లీ. నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పురుగు ఉద్ధృతి బట్టి పిచికారీ చేయాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్‌లో సాగవుతున్న వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల్లో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి వంటి సలహాల కోసం 95739 59680 నంబరును సంప్రదించాలని భామిని వ్యవసాయాధికారి సింహాచలం తెలిపారు.

చలికాలం సంరక్షణ అవసరం



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: చలికాలం సమీపిస్తున్న తరుణంలో జీవాల పెంపకంలో సరైన సంరక్షణ చర్యలు చేపట్టాలని జియ్యమ్మవలస పశువైద్యాధికారి **మునికుమార్** తెలిపారు. రైతులు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

? జీవాల్లో నట్టల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి?

– సన్యాసిరావు, మానాపురం

● జీవాల్లో సకాలంలో నట్టలు నివారించకపోతే బరువు పెరగడంతో పాటు రక్తహీనతకు గురవుతాయి. ప్రతి 3, 4 నెలలకు విధిగా పేడ పరీక్ష చేయించి వైద్యుల సలహాతో డీవార్మింగ్ ద్రావణాలు వాడాలి.

? దూడ పుట్టినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

– ఆదినారాయణ, పాచిపెంట

● దూడ పుట్టిన వెంటనే ముక్కు రంధ్రాలు, నోటి నుంచి వచ్చే జిగురు తుడిచి శుభ్రం చేయాలి. దూడ బొడ్డును కత్తిరించిన తర్వాత అయోడిన్ ద్రావణాన్ని పూయాలి. దూడకు అరగంట లోపు జున్నుపాలను తాగించడంతో రోగనిరోధక శక్తి కలిగి మలబద్ధకం సమస్యను అరికట్టవచ్చు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన **M/s O3 Organic Agro Farms Reg No.1251/21 Managing Partner** అయిన విశాఖపట్నం జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం, సీతమ్మధార, డాక్టర్స్ కోలనీ, డోర్ నెం.55-42-5/2, విశాఖపట్నం, పిన్ నెం.530013 నివాసులు అయిన ఆనాల సత్యన్నారాయణ గారి కుమారుడు **ఆనాల అంజిబాబు** వారు నాకు యిచ్చిన భోగట్టపై నా క్లయింటు 1. శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, కొత్తకోట గ్రామము కరణము లేటు యర్రన్నాయుడు గారి కుమారుడు రమేష్ బాబు. 2. శ్రీకాకుళం జిల్లా, బూర్జ మండలం, జగన్నాధపురం గ్రామము ఖండాపు అనంతరావు గారి కుమారుడు జగన్మోహనరావు. 3. డిటో కాపురస్తుడు లేటు గౌరిచంద్ర పాడి గారి కుమారుడు రామచంద్ర పాడి, 4. శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, దకరవలస గ్రామం, కోళ్ళ లేటు దాలినాయుడు గారి భార్య కోళ్ళ అనూష జన నలుగురి వద్ద క్రింది షెడ్యూలు ఆస్థికి క్రయ పురోణి పొందడం జరిగినది.

క్రింది వివరించిన షెడ్యూల్ ఆస్తులు **కరణము రమేష్ బాబు** వగైరాలు తాలూకా స్వార్జితమై నేటి వరకు వారి యొక్క హక్కు అనుభవములో కలవు. సదరు భూములపై వారికి తప్ప వేరే వారికి ఎటువంటి హక్కు అనుభవములు లేవు కనుక ఈ క్రింది వివరించిన షెడ్యూలు ఆస్తిని నా క్లయింటు క్రయము ద్వారా రిజిస్ట్రీ పొందుటకు నిర్ణయించుకొని యున్నారు. కావున ఈ ప్రకటన వెలువడిన 20 రోజుల (ఇరవై) లోగా ఎవరికీ ఎటువంటి అభ్యంతరములు సదరు ఆస్థిపై ఉన్నయెడల నాకు తెలియజేయవలసినదిగా కొరడమైనది.

షెడ్యూలు ఆస్థి:

1వ ప్రతి: పార్వతీపురం మన్యం జిల్లా, సబ్ రిజిస్ట్రీ ఆఫీసు యిలాకా ఓణి పంచాయతీ, ఓణి గ్రామం దస్తావేజు నెం: 1842/2023, సర్వే నెంబర్.263-3, య.8.75 సెంట్లు, సర్వే నెంబర్. 259 య.1.91 సెంట్లు వెరసి య.10.66 సెంట్లు పల్లం భూమి.

2వ ప్రతి: డిటో గ్రామం దస్తావేజు 2556/2023, సర్వే నెంబర్.259, య.0.67, సర్వే నెం.258, య.0.57 సెంట్లు వెరసి య.1.24 సెంట్లు పల్లం భూమి.

3వ ప్రతి: డిటో గ్రామం, సర్వే నెం.252-1, య.1.61 సెంట్లు, సర్వే నెం.258, య.0.57 సెంట్లు వెరసి య.2.18 సెంట్లు పల్లం భూమి.

4వ ప్రతి: డిటో గ్రామం సర్వే నెం : 255, య..3.28 సెంట్లు, సర్వే నెం: 261, య.3.37 సెంట్లు పల్లం భూమి, వెరసి య.6.65 సెంట్లు పల్లం భూమి. నాలుగు ప్రతుల మొత్తము కలసి య.20.73 సెంట్లు పల్లం భూమి.

జి.వాసుదేవరావు, సెల్ : **9440416616**
పి.జయరాం, సెల్ :**9440430658**
అడ్వకేట్స్
పరాంకుశనగర్ కోలనీ, శ్రీకాకుళం

విజయలక్ష్మి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ మాతృమూర్తి విజయలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె సంస్మరణ సభను పార్వతీపురంలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. చిత్రపటానికి కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిలుకూరి సుమలత నివాళులర్పించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే.మహేశ్వరి, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు మంత్రులు చరవాణిలో మానవేంద్రనాథ్‌రాయ్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే విజయచంద్ర, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, వైద్యులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పి.నర్సింగరావు, పలు జిల్లాల అదనపు న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు



తిరుపతి లడ్డూలో వినియోగించిన నెయ్యి కల్తీ కావడంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సాలూరులో ఆ పార్టీ నాయకులు పూజలు చేశారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు జి.రిషివర్ధన్, సాలూరు మండలాధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో పంచముఖేశ్వర ఆలయంలో అభిషేకాలు చేశారు. వారికి మంత్రి సంధ్యారాణి మద్దతు తెలిపి పూజల్లో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మక్కువ, సాలూరు గ్రామీణం

3 వేల టన్నుల మాంసం స్వాధీనం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని కేఎల్ పురం సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న పశు కబేళాపై టాస్క్‌ఫోర్స్ అధికారుల సహకారంతో ఒకటో పట్టణ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 30 ఆవులను, తరలించడానికి సిద్ధంగా ఉంచిన 3 వేల టన్నుల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. 8 మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఐటీడీఏ తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఐటీడీఏ తీరుపై గవర్నర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశామని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాయిబాబా, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ తెలిపారు. పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో గిరిజనులకు నష్టం జరుగుతోందన్నారు. ఇతర పనులకు ఐటీడీఏ నిధులు మళ్లిస్తున్నారని ఆరోపించారు. పీవో, పాలనాధికారి, ప్రబంధకుడు, గిరిజన సంక్షేమ డీడీ, ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు లేఖలో పేర్కొన్నారు. త్వరలో గవర్నర్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తామన్నారు.

ఈపీడీసీఎల్ ఏవోగా లక్ష్మీనారాయణ

విజయనగరం పట్టణం: ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి జిల్లా పరిపాలనాధికారిగా పనిచేసిన జి.శ్రీనివాసం కొత్తగా ఏర్పడిన మన్యం సర్కిల్ పరిపాలనాధికారిగా నియమితులయ్యారు. ఈయన స్థానంలో విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి కేవీ.లక్ష్మీనారాయణ రానున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	115	200	210

భర్త మోసగించాడని మహిళ ఆందోళన



పోతనాపల్లిలో సుధాకర్ ఇంటి ముందు బైఠాయించిన హైదరాబాద్‌కు చెందిన మహిళ (కార్డు పట్టుకున్న ఆమె), కుటుంబ సభ్యులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: తన భర్త మరో మహిళను పెళ్లి చేసుకుని అన్యాయం చేశాడని ఆరోపిస్తూ.. ఓ వివాహిత కుటుంబ సభ్యులతో కలిసి అతని ఇంటి ముందు బైఠాయించిన ఘటన శృంగవరపుకోట మండలం పోతనాపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన పరమేశ్వరి, కుటుంబ సభ్యులతో కలిసి తన భర్త పి.సుధాకర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సుధాకర్ హైదరాబాద్‌లో హోం గార్డుగా పని చేయగా, తాను పక్కనే ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని సెక్యూరిటీలో పనిచేశానన్నారు. ఇద్దరం ప్రేమించుకుని 2014లో పెద్దల సమక్షంలో యాదగిరి గుట్ట ఆలయంలో పెళ్లి చేసుకున్నామని చెప్పారు. తమకు అయిదేళ్ల పాప కూడా ఉందన్నారు. ఏడాది కిందట తండ్రి చనిపోయాడని అబద్ధం చెప్పి స్వగ్రామానికి వచ్చి విశాఖకు చెందిన వేరే మహిళను వివాహం చేసుకున్నాడని ఆరోపించారు. హైదరాబాద్‌లోనే కాపురం పెట్టాడని చెప్పారు. నాలుగు నెలల కిందట ఫోన్ చేస్తే సదరు మహిళ మాట్లాడడంతో అసలు విషయం బయటపడిందన్నారు. జూన్ 12న ముషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అతన్ని ఉద్యోగం నుంచి తీసేశారని చెప్పారు. అనంతరం ఇక్కడకు వచ్చేశారని, చేసేది లేక న్యాయం కోసం వచ్చామన్నారు. సుధాకర్ కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరన్నారు. దీనిపై ఎస్.కోట సీఐ నారాయణమూర్తిని వివరణ కోరగా.. ముషీరాబాద్ స్టేషన్‌లో కేసు నమోదైందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ప్రాణం తీసిన విద్యుత్తు తీగలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తెగిపడి ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళా రైతు మృతిచెందిన ఘటన పాలకొండ మండలం గొట్టమంగళాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్.పార్వతమ్మ(58), సింహాచలం దంపతులు కూరగాయలు సాగు చేస్తూ.. జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం పార్వతమ్మ పొలానికి వెళ్లారు. దారిలో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్తు తీగను గమనించకుండా అడుగు వేశారు. ఈక్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

ట్రాక్టరు పైనుంచి పడి వలస కూలీ దుర్మరణం

చౌటుప్పల్‌గ్రామీణం: పురపాలిక పరిధిలోని లింగారెడ్డి గూడెం శివారులోని పిలాయిపల్లి కాల్వ కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు సీఐ మన్మథకుమార్ సోమవారం తెలిపారు. బలిజిపేట మండలం గంగాడకు చెందిన జి.గణేశ్(40) భార్యతో కలిసి అయిదు నెలల నుంచి మందోల్లగూడెంలోని చింతపల్లి నర్సింహారెడ్డి కోళ్ల ఫారంలో పని చేస్తున్నాడు. ఆదివారం చౌటుప్పల్‌లో సంత కావడంతో సరకులను కొనేందుకు తోటి కూలీలతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చోదకుడి పక్కనే కూర్చున్న ఆయన అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో చక్రాలు అతనిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతని భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శంకరరావు (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. పెదశిర్లాం గ్రామానికి చెందిన సీహెచ్.శంకరరావు(50) గతనెల 27న గ్రామం బయట పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ముందుగా రాజాం.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. శంకరరావు టింబర్ డిపోలో, ఇంట్లో కర్రలతో గృహోపకరణాలు తయారు చేసేవాడు. అతనికి భార్య రుక్మిణి, కుమార్తె కరిష్మా ఉన్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్సై రాజారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆపరేటరు మృత్యువాత



శ్యామ్‌కుమార్ (పాతచిత్రం)

గుర్ల, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గుర్ల మండలం పరిధి నెల్లిమర్ల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. . నెల్లిమర్లలోని తెలగ వీధికి చెందిన ఎస్.శ్యామ్‌కుమార్(40) మిమ్స్‌లో కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం రాజాంలో అత్తవారింటికి పండగకు వెళ్లారు. సోమవారం భార్యను అక్కడే విడిచిపెట్టి విధులకు హాజరవడానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. గుర్ల మండలం పరిధి నెలిమర్ల రైల్వే స్టేషన్ వద్ద కారు ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డారు. అతని భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు చెప్పారు.

గంజాయి స్వాధీనం.. జామి: జామి మండలం అలమండ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి విజయనగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వీరజనార్దన్ తెలిపారు. రెండు కిలోల సరకు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టుకు తరలించామన్నారు. కేసును ఎస్.కోట రూరల్ సీఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

మద్యానికి బానిసై.. బలవన్మరణం

మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని మహానాడులో నివాసం ఉంటున్న ఇంటూరి నారాయణ (58) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేటకు చెందిన నారాయణ, సత్యవతి దంపతులు కొన్నేళ్లుగా ఇక్కడ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గత నెలలో సత్యవతి కంటి వైద్యం కోసం స్వగ్రామానికి వెళ్లారు. ఈలోగా వరదలు రావడంతో ఇంట్లోని సామగ్రి వరదలో కొట్టుకుపోయాయి. దీంతో నిలువనీడలేని ఆయనకు స్థానికంగా ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు పార్టీ కార్యాలయంలో ఆశ్రయం కల్పించారు. ఎప్పటి నుంచో మద్యానికి బానిసైన ఆయన ఈనెల 29వ తేదీ అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మానవత్వం చాటిన 'కిద్మత్ టీమ్'

భార్య సోమవారం తాడేపల్లి పోలీసుస్టేషన్‌కి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. భర్త మృతదేహాన్ని విజయనగరం జిల్లాకి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించే స్థోమత తనకు లేదని పోలీసులకు వివరించారు. ఈక్రమంలో పోలీసుల సహకారంతో మంగళగిరికి చెందిన 'కిద్మత్ టీమ్' సభ్యులు మృతదేహాన్ని మోసుకెళ్లి పట్టణంలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

చోదకుడికి అస్వస్థత స్తంభాన్ని ఢీకొన్న పాఠశాల బస్సు



నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులను తీసుకొని బస్సులో వెళ్తున్న ఓ చోదకుడు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ క్రమంలో అదుపు తప్పిన వాహనం సమీపంలో ఉన్న స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం నగరంలోని సీఎంఆర్ కూడలి వద్ద చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ విద్యాసంస్థకు చెందిన వాహనం చిన్నారులను ఇళ్లకు చేర్చే క్రమంలో 60 ఏళ్ల చోదకుడికి మూర్ఛ వచ్చిందని, అయితే చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదని ఒకటో పట్టణ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం



క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించే విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి అండర్- 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ క్రీడ ఎంపికలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు చరవాణులకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు పాఠశాలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు తరలివచ్చినట్లు పాఠశాల క్రీడల కార్యదర్శి ఎం.మురళీ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పట్టణాధ్యక్షుడు ఎన్.చిట్టి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


బాల్య వివాహాలతో అనర్థాలు



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు తదితరులు

బెలగాం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి ఎస్. దామోదరరావు పేర్కొన్నారు. ఐతర్పడబ్ల్యూఏ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురం కోర్టు ఆవరణలో సంబంధిత గోడప్రతులను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ అదనపు మేజిస్ట్రేట్ సౌజన్యతో కలిసి విడుదల చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, గ్రామాల్లో చిన్నారులు తల్లిదండ్రులకు యువత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి. వెంకటరావు, సంస్థ డైరెక్టర్ ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోపు అర్జీదారులకు న్యాయం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదుదారులకు నిర్ణీత గడువులోపు న్యాయం చేయాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. దంపతుల మధ్య గొడవలు, ఆస్తి, భూ తగాదాలు, ప్రేమ, సైబర్ మోసాలు, అత్తింటి వేధింపులకు సంబంధించి పలువురు అర్జీలు ఇచ్చారు. వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత ఠాణాల ఎస్సైలను ఆదేశించారు. సీఐలు ఎర్రంనాయుడు, జీడీ బాబు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: కేసీఎపురం బీసీ కాలనీ, శివాలయం పరిధిలో వీధి దీపాలు వెలగడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటరమణ**

● పరిశీలించి కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. **- కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, సీతానగరం**

?: మొండెంఖల్లు గ్రామంలోని పలు వీధుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విజృంభిస్తున్నాయి. **- రామకృష్ణ**

● రెండు రోజుల్లో పారిశుద్ధ్య కార్మికులతో పరిసరాలు శుభ్రం చేయిస్తాం. దోమల మందు పిచికారీ చేయిస్తాం. **- ఎ.గౌరీశంకరరావు, సర్పంచి - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం**

?: బలిజిపేట- చిలకలపల్లి ప్రధాన రహదారిపై యాదవవీధి వద్ద చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. **- జి.గోవిందరావు**

● పరిశీలించి రెండు రోజుల్లో పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **- పి.అదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, బలిజిపేట**

?: నగర పంచాయతీలోని ఎన్‌కే రాజపురం అసిరితల్లి గుడి వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. **- జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు**

● దీపాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. **- దేవిశ్రీప్రసాద్, నగర పంచాయతీ ఏఈ - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం**

చెత్త.. ఇక సంపదే!

❖ ఎరువుగా మారనున్న వ్యర్థాలు ❖ పంచాయతీలకు ఆదాయం

పార్వతీపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ పాలనలో మూలకు చేరిన చెత్త నుంచి సంపద కేంద్రాలకు పూర్వ వైభవం వచ్చింది. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సంపద కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఇకపై గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎరువుగా మార్చి సంపద సృష్టించనున్నారు.



మొండెంఖల్లులో ప్రారంభమైన సంపద కేంద్రం

ఉపాధి హామీతో అనుసంధానం..

పంచాయతీల్లో సంపద కేంద్రాలను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 2500 ఎకరాల్లో ఆ పథకం కింద తోటల పెంపకం చేపట్టారు. ఐటీడీఏ పరిధిలోనూ తోటలు పెంచుతున్నారు. ఈ లబ్ధిదారులకు రెండేళ్ల పాటు సేంద్రియ ఎరువు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడే గతంలో అక్రమాలు జరిగాయి. ఎరువులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు నిధులు పక్కదారి పట్టించారు. ఐటీడీఏలో గతంలో వేపపిండి కొనుగోలులో ఇలాంటి పరిస్థితులే చోటు చేసుకున్నాయి.


తడి, పొడిగా వేరుచేసి..

చెత్తను ముడి సరకుగా వినియోగించి సేంద్రియ ఎరువు తయారు చేసేలా కేంద్రాలను సిద్ధం చేశారు. ❖ రోజూ గ్రామంలో చెత్తను సేకరించి పొడి, తడిగా వేరు చేసి ఎరువు తయారు చేస్తారు. ❖ గతంలో మాదిరిగా ఎరువును విక్రయించి ఆదాయం సంపాదిస్తారు.

ప్రారంభమైన కేంద్రాలు..

జిల్లాలో 46 కేంద్రాలు మినహా మిగిలినవి సిద్ధమయ్యాయి. వీటిలో కొన్నింటిని శనివారమే ప్రారంభించారు. మిగిలిన వాటిని ఆదివారం ప్రారంభిస్తారు. 46 కేంద్రాల్లో రేకులు పాడవడంతో బాగు చేసే అవకాశం లేకుండా పోయింది. వాటినీ త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టనున్నారు.

జిల్లాలో వివరాలు..



ఆన్‌లైన్లో వివరాలు..

ఉపాధిహామీ పథకంలో ఎఫ్‌టీవోను తయారు చేసి ఆన్‌లైన్లో నమోదు చేస్తే ఎరువుకు సంబంధించిన నగదు పంచాయతీ ఖాతాల్లో చేరుతుంది. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పంచాయతీలకు నిధులు వస్తాయి. గతంలో ప్రైవేటు వ్యక్తులకు ఎరువులు ఇచ్చిన సందర్భాలు ఉన్నా, డబ్బులు రావడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం ఆ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు.

ఏర్పాట్లు పూర్తి చేస్తాం..

ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది 2500 ఎకరాల్లో తోటలు పెంచుతున్నాం. వాస్తవానికి జిల్లాలో తయారైన ఎరువు సరిపోదు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మొత్తం ఎరువును కొనుగోలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. దీంతో అందరికీ లాభసాటిగా ఉంటుంది. **- కె.రామచంద్రరావు, పీడీ, డ్వామా, పార్వతీపురం మన్యం**

టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

ఎమ్మెల్యే విజయచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారులకు రూ.2.32 కోట్లు చెల్లించాల్సి ఉందని, ఈ మొత్తాన్ని ప్రస్తుతం చెల్లించేలా చూస్తామని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. సంబంధిత ఇళ్లను అక్టోబరు నెలఖరులోగా అప్పగించేలా చూస్తామన్నారు. సోమవారం పుర అధ్యక్షురాలు బి.గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. టిడ్కో మొత్తాలపై ఒకటో వార్డు కౌన్సిలరు ఆర్.బంగారునాయుడు ప్రశ్నించగా ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు సమావేశాలకు ఎందుకు రావడం లేదని 8వ వార్డు కౌన్సిలర్ కె.నారాయణరావు ప్రశ్నించారు. పట్టణంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలువురు సభ్యులు కోరారు.

నమ్మకం కలిగించారు: వైకాపా కౌన్సిలర్

వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులు కూటమి వచ్చిన తర్వాత పూర్తి చేశారని పదో వార్డు వైకాపా కౌన్సిలర్ దివ్య పేర్కొన్నారు. కాలువల శుభ్రత, వీధి దీపాల ఏర్పాటులో తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. వార్డులో అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశం ప్రారంభంలో కొందరు వైకాపా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. పుర కమిషనరు కె.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!

పాలకొండ పట్టణంలోని నీలమ్మకాలనీలో కుళాయిల కోసం తవ్విన గొయ్యి ప్రమాదకరంగా మారింది. రహదారిని ఆనుకొని నీలమ్మ తల్లి ఆలయానికి ఎదురుగా ఉంది. దసరా ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున వస్తారు. ఆదమరిస్తే గోతిలో పడే ప్రమాదముంది. ఉత్సవాలకు ముందే దీన్ని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. త్వరలో పూడుస్తామని నగర పంచాయతీ ఏఈ దేవీవరప్రసాద్ తెలిపారు. **- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం**



కూరుకుపోతున్న లారీలు



భామిని మండలంలోని కొరమ నుంచి బత్తిలి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ఇసుక లారీలు కూరుకుపోతున్నాయి. ఎక్కడకక్కడ గోతులతో దర్శనమిస్తుంది. ఒడిశా నుంచి ఇసుక తరలిస్తున్న లారీలు సతివాడ, దిమ్మిడిజోల ప్రాంతాల్లో దిగబడిపోతున్నాయి. వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. దీనిపై ర.భ శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా.. త్వరలో మరమ్మతులు చేపడతామని తెలియజేశారు. **- న్యూస్‌టుడే, భామిని**

మేల్కొకుంటే ముప్పు తప్పదు

కురుపాం మండలంలోని తెన్నుఖర్జ వద్ద ప్రయాణికుల విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులు ఊడిపోయింది. వర్షాల సమయంలో ఇక్కడ వేచి ఉండేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండకాస్తే చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదం జరగకముందే భవనం తొలగించాలని కోరుతున్నారు. విషయం ర.భ.శాఖ అధికారిణి నిర్మల వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం**



మొక్కజొన్న పంట పరిశీలన



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏవో శ్రీనివాసరావు

స్పందనకు వందనం

మక్కువ, న్యూస్‌టుడే: నంద గ్రామ పరిధిలో మొక్కజొన్న పంటలను ఏవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఆదివారం ఈనాడులో ప్రచురితమైన 'నకిలీలు అంటకట్టి.. నట్టేట ముంచి' కథనంపై స్పందించారు. గిరిజన రైతులతో మాట్లాడి విత్తనాలు, కంపెనీ వివరాలు సేకరించారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ బి.సురేష్, ఎస్‌ఆర్పీలు ఎస్.మాధవరావు, బి.దాసు కోరారు. మంగళవారం నుంచి 2023-24లో రూ.24 కోట్లతో చేపట్టిన పనులపై తనిఖీలు ఉంటాయన్నారు. ఏపీడీ ఆర్.సురేష్‌నాయుడు, ఎంపీడీవో కె.రామారావు ఉన్నారు.

పోస్టులు ఉన్నతీకరించాలని డిమాండు

వీరఘట్టం, న్యూస్‌టుడే: భాషా పండితుల పోస్టులు ఉన్నతీకరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు కోరారు. మండలంలోని ఎస్.నర్సిపురం, దశుమంతపురం, ఎం.డి.వలస, చలివేంద్రి, బూరుగ, వీరఘట్టం పాఠశాలలను సోమవారం సందర్శించారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యదర్శి కె.గోవిందరావు ఉన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

మక్కువ, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్నికల ముందు, అనంతరం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. సోమవారం సాలూరులో మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంచాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి జ్యోతి, సభ్యులు శశికళ, సిటు జిల్లా కార్యదర్శి నాయుడు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని, సీతంపేట, న్యూస్‌టుడే: పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి ఎస్ మణి ఓ ప్రకటనలో తెలిపారు. సేవా దృక్పథం ఉన్న వారు అర్హులన్నారు. కొత్తూరు, హిరమండలం, భామిని మండలాల నివాసితులై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

4న కురుపాంలో ఉద్యోగ మేళా

పార్వతీపురం, న్యూస్‌టుడే: కురుపాంలో ఈ నెల 4న శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయిచైతన్యను సంప్రదించాలన్నారు. మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ సూచించారు.

ఐటీడీఏలో 56 వినతులు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల నుంచి పలువురు తమ సమస్యలపై 56 వినతులు అందజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, డీడీ ఎం.అన్నాదొర తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గ ఉత్సవాలు



పాలకొండ గ్రామీణం: నక్కలపేటలోని జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో సప్తమాతృక సహిత నవదుర్గ దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు పి.కొండబాబు తెలిపారు. 3న మట్టి ఉత్సవ విగ్రహాలు ప్రతిష్ఠిస్తామని, 9న అక్షరాభ్యాసాలు ఉంటాయన్నారు.

మద్యం ధ్వంసం

బలిజిపేట పోలీసు స్టేషన్ పరిధిలో 44 కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలు, నాటుసారా పొట్లాలను పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. మొత్తం 618 లీటర్ల మద్యం, భారీగా నాటుసారా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. **- న్యూస్‌టుడే, బలిజిపేట**



పంట నమోదు పరిశీలన

సీతానగరం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలను సర్వే నంబరు ఆధారంగా ఈ పంటలో నమోదు చేయాలని ఏవో అవినాష్ తెలిపారు. సోమవారం కాశాపేటలో పునః పరిశీలన సర్వే చేశారు. తప్పుగా ఉన్న నమోదులు సరి చేస్తామన్నారు. వీఆర్వో నాగమణి, వీఏఏ జగదీష్ ఉన్నారు.

ఉచిత అన్న ప్రసాదానికి విరాళం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కోటదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాటు చేయనున్న ఉచిత అన్న ప్రసాదానికి రూ.10 వేలు, 15 బియ్యం బస్తాలను ఉత్సవ కమిటీ సభ్యురాలు కె.యోగిత అందజేశారు. ● **మక్కువ, సాలూరు గ్రామీణం:** విజయవాడ వరద బాధితులకు మాజీ కౌన్సిలర్ సీహెచ్.ఎల్లంనాయుడు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మంత్రి జి.సంధ్యారాణికి నగదు అందజేశారు.

ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చినమరికికి చెందిన జి.వెంకటరమణ అప్పులు చేశారు. తీర్చే మార్గం కనిపించక మనోవేదనకు గురై గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నిందితుడి అరెస్టు

వీరఘట్టం: బిటివాడలో బంగారం చోరీ కేసులో నిందితుడు యోగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. 6.5 తులాల బంగారం, 37 తులాల వెండి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కొరియాలో నిలిచిన సరఫరా

మక్కువ: కొరియా గ్రామాలు పట్టుచెన్నూరు, పగులుచెన్నూరు, కోనదార తదితర 9 గ్రామాల్లో శనివారం నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. సిబ్బందిని పంపిస్తామని ఏడీఏ తెలిపారు.

పత్తిలో సస్య రక్షణకు చర్యలు

పాచిపెంట: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో తిరుపతిరావు సూచించారు. పి.కోనవలస, పద్మాపురం గ్రామాల రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. పత్తిని ఆశించే ఆకుచుట్టు పురుగు నివారణకు ద్రావణం పిచికారీ చేయాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

జియ్యమ్మవలస: ఈ నెల 2న పెదమేరంగి కూడలిలోని తిరుమలసాయి విద్యానికేతన్ ఆవరణలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సరళకుమారి, సలహాదారు ఆర్.వెంకటరమణ తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి

భామిని: గిరిజన రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలని వెలుగు ఏపీవో పి.నాగేశ్వరరావు అన్నారు. పలు గిరిజన గ్రామాల్లో ప్రకృతి సాగు, గుళి రాగి పంటలను పరిశీలించారు.

జిల్లాస్థాయి పోటీల్లో సత్తా

వీరఘట్టం: గంగంపేట ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.చైతన్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.భాస్కరరావు తెలిపారు. శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడన్నారు.

సరిహద్దుల్లో ఏనుగులు



కొమరాడ, న్యూస్‌టుడే: ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లో ఉన్న చిన బంజుకుప్ప, నగుళ్లవలస (ఒడిశా) అటవీ ప్రాంతాల్లో కరిరాజులు సంచరిస్తున్నాయి. రెండు రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా కాపలా కాస్తున్నారు.

ఎస్‌ఐగా ప్రశాంత్‌కుమార్



జియ్యమ్మవలస: జియ్యమ్మవలస ఎస్‌ఐగా ఎన్.ప్రశాంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పి.అనీష్ చినమేరంగి వెళ్లగా, పార్వతీపురం వీఆర్ నుంచి ప్రశాంత్ వచ్చారు. ● **సీతంపేట:** మండల ఎస్సైగా వై.అమ్మన్నరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జగదీశ్‌నాయుడు బదిలీపై సాలూరు వెళ్లారు.

అబ్కారీ సీఐగా పద్మావతి



సీతానగరం: అబ్కారీ శాఖ సీతానగరం సీఐగా డి.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు బదిలీపై విజయనగరం వెళ్లగా, పద్మావతి పార్వతీపురం నుంచి వచ్చారు.

శాంతి భద్రతలపై దృష్టి

పార్వతీపురం పట్టణం: శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన జి.దేముడుబాబు సోమవారం ఎస్పీని కలిశారు.

మహిళలకు ఆర్థిక స్వావలంబన అవసరం

పార్వతీపురం గ్రామీణం: మహిళలు చైతన్య వంతులుగా మారితే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. సోమవారం పెదబొండపల్లిలో పర్యటించారు. ఎదతిగే పిల్లలు పౌష్టికాహార లోపం బారిన పడకుండా చూడాలన్నారు. ● **పాలకొండ:** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని తెదేపా పట్టణాధ్యక్షుడు జి.సంతోష్ అన్నారు. సోమవారం కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం కృష్ణారావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం పరిశీలన

బెలగాం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి సూచించారు. సోమవారం పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఇక్కడున్న 9 గదులు విద్యార్థులకు సరిపోవడం లేదని సిబ్బంది తెలిపారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, శుభ్రం చేయాలని సంరక్షకుడికి సూచించారు. సహాయ అధికారి అప్పన్న ఉన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ఆట పాటలతో వినూత్న బోధన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తూ, ఆటపాటలతో వినూత్న బోధన చేపట్టాలని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించారు. చిన్నారులతో ముచ్చటించి పరికరాలు పరిశీలించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజు, సీడీపీవో సుశీలాదేవి, సర్పంచి గౌరీశంకరరావు పాల్గొన్నారు. ❖ **జియ్యమ్మవలస:** అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని రకాల సేవలు అందజేస్తుందని ఐసీడీఎస్ పర్యవేక్షకులు ఎన్.గౌరమ్మ అన్నారు. జియ్యమ్మవలస నాలుగో కేంద్రంలో పోషకాహారం ప్రదర్శించారు.

వేతనాలు ఇప్పించరూ!

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా కన్వీనరు బి.వి.రమణ డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని జేసీ శోభికకు వినతిపత్రం ఇచ్చారు. ❖ గుమ్మలక్ష్మీపురం, సాలూరు గర్భిణుల వసతి గృహాల్లోని ఆరోగ్య సిబ్బందికి 15 నెలల వేతనాలు చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ డిమాండు చేశారు. కలెక్టర్ ముందు నిరసన తెలిపారు.



నినాదాలు చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు

ఆలయాల్లో జనసైనికుల పూజలు



మక్కువలో దీపారాధన చేస్తున్న నాయకులు

కొమరాడ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు కురుపాం నియోజకవర్గ జనసేన నాయకులు మద్దతు పలికారు. సోమవారం నియోజకవర్గ బాధ్యుడు కె.మల్లేశ్వరరావు తదితరులు గుంప సోమేశ్వరాలయంలో పూజలు చేశారు. ఎన్.వంశి, వి.శివకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు. ❖ **మక్కువ:** మక్కువ శివాలయంలో జనసేన, తెదేపా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుగుణేశ్వరరావు, తెదేపా నాయకుడు ఎం.ప్రసాదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట గిరిజన సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ కృష్ణమోహన్, పీడీ లక్ష్మణమూర్తి సోమవారం తెలిపారు. అండర్- 18లో ఎస్.దిలీప్, ఎన్.ప్రవీణ్, అండర్- 19లో ఎస్.దిలీప్, ఎ.రవి, ఎస్.శరత్‌కుమార్, ఎస్.జానగిరి, ఎ.సతీష్, ఎస్.గణేష్, ఎస్.విజయ్‌కుమార్, ఎన్.ప్రవీణ్‌కుమార్, ఎస్.డియోనేస్‌సబీర్, ఎస్.శ్రీను, ఎస్.మనోహర్, ఎస్.ప్రదీప్, ఎస్.హర్షవర్ధన్, ఎ.అర్జున్ వివిధ క్రీడల్లో ఎంపికయ్యారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది